ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 సంచిక : 09 మే 2019

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

27-01-1985
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-01-1985, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఏదో ఒక రోజున అందరం మరణిస్తాము. అందులో రాజీ లేదు. మీలో ఎవరికైనా సందేహం ఉందా? ఏదో ఒక రోజున అందరం మరణిస్తాము, ఆదివారం అవ్వనివ్వండి, శనివారం అవ్వనివ్వండి. అందరికీ తలో వారం ఉంది. ఇందులో ఎవరికీ సందేహం లేదు, మీరు చెప్పే మాటలు వట్టిదేనండి అని పేచీలకు అవకాశం లేదు. ఏదో ఒక రోజు, ఏదో ఒక వారం మరణిస్తాము. మనం మరణాన్ని వాయిదాలు వేసుకొంటున్నాము. ఇప్పుడు మనకి వయస్సు నలభై ఏళ్ళు కదా ఇంకో ముప్ఫై ఏళ్ళు ఎలాగైనా గెంటేస్తాము, లేకపోతే ఇప్పుడు వయస్సు అరవై ఏళ్ళు, ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాము ఏలాగైనా ఇంకో ఇరవై ఏళ్ళు గెంటేస్తాము. జాగ్రత్తగా టైముకి భోజనం చేసి ఇంటివద్ద నీడపట్టున ఉంటే వంద సంవత్సరాలు ఉండొచ్చు మనకి ఇంటి దగ్గర లోటు లేదు కదా! ఏదో విటమినులు ఉన్న ఫుడ్ ఉంది, అన్నీ బాగానే ఉన్నాయి, వంద సంవత్సరాల వరకూ గెంటేయవచ్చు అనుకుంటాము. మొత్తం మీద ఎన్ని వాయిదాలు వేసుకున్నా నూరవ సంవత్సరంలో అయినా మరణం తప్పదు. ఇప్పుడు మనకి అన్ని సదుపాయాలూ ఉన్నాయి అనుకోండి, ఇంటి చుట్టూ డాక్టర్లు ఉన్నారు అనుకోండి, అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ ఏదో ఒక రోజున మరణం తప్పదు.

భగవాన్ని ఒకరు అడిగారు, స్వామీ మమ్మల్ని ఎలా బ్రతకమంటారు అని, నువ్వు చచ్చిన వాడివలె బ్రతుకు అన్నారు. అంటే ఏది చావటం? మనకి గతించిపోయినవి అన్నీ జ్ఞాపకాలు వస్తూ

ఉంటాయి. ఈ మనస్సు తెచ్చే రొచ్చు అంతా జ్ఞాపకాల రూపంలో తలంపుల రూపంలో ఆలోచనల రూపంలో వచ్చి అంతఃకరణాన్ని అంతా బురద చేస్తోంది. శరీరగతమైన నేను, ఎవరైతే నేను నేను అంటున్నామో ఆ నేను కనుక మరణిస్తే అంటే మరణించిన వాడిలాగ జీవిస్తే - అంటే శరీరం మరణించటం వల్ల లాభం లేదు. శరీరం ఏదో ఒక రోజున మరణిస్తుంది. శరీరం మరణించక ముందే మనం మరణిస్తే, ఏ రోజున ఏ సెకనులో మీరు మరణించారో అప్పుడు జ్ఞానం వస్తుంది. అంటే లైఫ్ ఈజ్ ఎండ్ లెస్. మనం ప్రయాణం చేసేటప్పుడు గుర్రపుబండి మారతాం, కారు మారతాం, రైలు మారతాం, రిక్షా మారతాం. అదే విధంగా లైఫ్ ఈజ్ ఎండ్ లెస్. ఇప్పుడు మనం ఈ శరీరంలో ఉన్నాము, కొంతకాలం ఉన్న తరువాత ఇంకో కొత్త శరీరం వస్తుంది, ఆ శరీరంలో ఉంటాము. శరీరం పడిపోతుంది కాని జీవితం కంటిన్యూ అవుతూ ఉంటుంది.

సర్వసాధారణంగా శరీరం నేను అనే భావన అందరికీ ఉంది. నాకు ఉంది, మీకు ఉంది, అందరికీ ఉంది. కానీ ఈ శరీరానికి మనం ఓనర్స్. ఈ మైక్ నాది అంటే, ఈ మైక్ నేను అని కాదు, ఈ మైకుకి యజమానిని నేను. ఈ పొలం నాది, ఈ పొలం నాది అన్నప్పుడు ఈ పొలం నేనని కాదు, ఆ పొలానికి యజమానిని నేను. ఈ ఇల్లు నాది, అంటే ఇల్లు నేనని కాదు, ఆ ఇంటికి యజమానిని నేను. అదేవిధంగా ఈ శరీరం నాది. అంటే ఈ శరీరం నేనని కాదు, ఈ శరీరానికి యజమానిని నేను. అంటే ఓనరుని అన్నమాట నేను! ఈ మైకుకి ఓనరుని ఎలాగో, ఈ పొలానికి ఎలాగో, ఇల్లుకి ఎలాగో, అలాగే ఈ శరీరానికి కూడా ఓనరుని. అంతేగాని ఈ శరీరం నేను అని కాదు.

ఎక్కడైతే ప్రేమ లేదో, ఎక్కడైతే దయ లేదో, ఎక్కడైతే సానుభూతి లేదో, అక్కడ తెలివితేటలు కూడా ఉండవు. మీ తెలివితేటలు అభివృద్ధి పొందాలంటే, దయ పెరగాలి, సానుభూతి పెరగాలి. ఎక్కడైతే ద్వేషం ఉందో అక్కడ తెలివితేటలు కూడా ఉండవు. ఎక్కడైతే అసూయ ఉందో అక్కడ తెలివితేటలు కూడా ఉండవు. ఈ గుణాలు మనలో మరణించటమే నిజమైన మరణం. గుణాలు ఇప్పుడే మనలో మరణిస్తే ఇప్పుడే జ్ఞానం వచ్చేస్తుంది. ఇంకేంటి మీరు వాయిదాలు వేసేది? మనలో ఏదైనా ద్వేషం ఉందనుకోండి, పగ ఉందనుకోండి, కార్పణ్యం ఉందనుకోండి, ఆ గుణాలు అన్నీ ఇప్పుడే మరణించాయి అనుకోండి, ఇప్పుడే మనకు జ్ఞానం వచ్చేస్తుంది! అది లోపల సిద్ధంగానే ఉంది. శరీరానికి మరణం రాకముందు మనం మరణిస్తే జ్ఞానులు అయిపోతారు మీరందరూ. ఈ దేహానికి మరణం రాకముందే

మీరు మరణించటానికి ప్రయత్నం చెయ్యండి. అదే సాధన. నిజంగా ఈ సృష్టిని అంతా ప్రేమించాలని మీకుంటే, ఈ పంచభూతాలని, సూర్యుడు చంద్రుడు జీవరూపంలో ఉన్న ఈ సృష్టిని అంతా మనం ప్రేమించాలని అనుకుంటే, మనలో ఉన్న స్వరూపం మనకి దర్శనం అవ్వాలి అనుకుంటే, మీరు మరణించాలి. ఏ మనిషైతే మరణించలేడో ఆ మనిషి ప్రేమించలేడు. ఏ మనిషైతే మరణించలేడో ఆ మనిషి కరుణామయుడు కాదు. మీరు చేసే సాధన ఏంటి చెప్పండి? రోజూ రెండు గంటలసేపు పూజ చేస్తున్నాం, లేకపోతే అనేక క్షేత్రాలు దర్శనం చేసి వచ్చాము, నామజపం ఎక్కువ చేస్తున్నాము అని మీరు అనుకోవచ్చు. కానీ అది కాదు - మీరు ఎన్ని గంటలు జపం చేస్తున్నారు, ఎన్ని గంటల సేపు పూజ చేస్తున్నారు అనేది ముఖ్యం కాదు. లోపల మీకున్న అహంకారం యొక్క పట్టు ఎంతవరకు తగ్గుతోంది. ఇది మీరు బాగా అర్థం చేసుకోవాలి. మీరు ఎన్ని గంటలసేపు పూజ చేస్తున్నారు, ఎన్ని గంటలు జపం చేస్తున్నారు, ఎన్ని గంటలు మౌనంగా ఉన్నారు, అది ప్రధానం కాదు. మీరు మౌనంగా ఉండొచ్చు, జపాలు వ్రతాలు మహావ్రతాలు చేసుకోవచ్చు, డబ్బులు ఖర్చు పెట్టి పుణ్యాలు సంపాదించుకోవచ్చు, మీరు సేవ చెయ్యవచ్చు. ఈ రమణకేంద్రం యొక్క గమ్యం పుణ్యం కాదు. ఈ రమణకేంద్రం యొక్క గమ్యం జ్ఞానం. పుణ్యం వల్ల మోక్షం రాదు, జ్ఞానం వల్ల మోక్షం వస్తుంది. పుణ్యం అవసరం లేదా అంటే అవసరమే, కాని అనుభవిస్తే పోతుంది. మిమ్మల్ని గమ్యానికి తీసుకెళ్ళటానికి ఈ రమణకేంద్రం కానీ, మిమ్మల్ని మధ్యదారిలో ఆపు చెయ్యటానికి కాదు. మిమ్మల్ని వివేకవంతులను చెయ్యటానికి రమణకేంద్రం కానీ, మిమ్మల్ని దోచుకోవటానికి కాదు. మీరందరూ భగవాన్ యొక్క అనుగ్రహంలో ఉన్నారు. ఒకవేళ మీకు తెలియక లేదు అని మీరు అనుకొన్నా అది పోదు. మీరు అనుకొంటున్నారా అనుకోవటం లేదా అనే మాటలతోటి సంబంధం లేకుండా, మీ ఆలోచనలతోటి సంబంధం లేకుండా మీరు భగవాన్ అనుగ్రహంలో ఉన్నారు.

నటేష్ మొదలియార్ అని ఒక భక్తుడు భగవాన్ దగ్గరకి వచ్చాడు ఆయన స్కందాశ్రమంలో ఉండగా, రెండు రోజులు కూర్చున్నాడు... భగవాన్ ఏమీ మాట్లాడలేదు. ఏమున్నాయి మాట్లాడటానికి. అసలు మాటలు దేనికండీ? ఈ ప్రపంచం ఎవరికి? అహంకారానికి. ఈ మాటలు ఎవరికి? అహంకారానికి. ఆత్మకి ఈ ప్రపంచం కావాలా? ఈ శరీరం కావాలా? రెండు రోజులు భగవాన్ దగ్గర కూర్చుంటే ఏమీ మాట్లాడలేదు భగవాన్. వీడేమి గురువు? వీడి దగ్గరికి వచ్చాను? ఒక మాట లేదు మంతి లేదు, మంచి లేదు చెడ్డ లేదు, కూర్చోమనడు మాట లేదు, మొరటు మనిషి, గోచీ పెట్టుకొని ఇక్కడ

కూర్చున్నాడు అనుకున్నాడు. మీరెవరైనా ఇంటికి వెళ్తే, వాళ్లు కూర్చోమనకపోతే మీరేమనుకొంటారు, మర్యాద తెలియని మనుషులు అనుకొంటారు. అలాగే నటేష్ మొదలియార్ అనుకొన్నాడు. నేను ఎక్కడినుంచో వచ్చాను స్కందాశ్రమం. ఎంతసేపు నుంచున్నా నా వంక చూడటం లేదు, కూర్చోమనడు. మంచినీళ్ళు తాగుతారా అనడు, ఏం గురువు వీడు, అని రెండు రోజులు ఉండి వెళ్ళిపోయాడు.

ఎంతసేపూ మన చూపు బయటి చూపే, మన బ్రాటప్ అటువంటిది. మనం పెరిగిన వాతావరణం పవిత్రమైన వాతావరణం కాదు. మనం పెరిగిన వాతావరణం జ్ఞానస్వరూపమైన వాతావరణం కాదు. అజ్ఞానమైన వాతావరణంలో పెరిగాం, అపవిత్రమైన వాతావరణంలో పెరిగాం. చీకటిలో పెరిగాం. చీకటిలో పెరగటం వల్ల మనకు లోచూపు లేదు, బయటి చూపే, కానీ గురువు చేసేది అంతా లోపల. గురువు చేసే పనికి నీ బయట మర్యాదలు అక్కరలేదు, నీ కృతజ్ఞత అంతకుముందే గురువుకు అక్కరలేదు. గురువు చేసే పని అంతా లోపలే చేస్తున్నాడు, బయట కాదు. మోహం అనేది బయట లేదు, అది కత్తిరించుకొంటే పోదు, మోహం మీ లోపలే ఉంది. మీ లోపల ఆపరేట్ చేస్తుండవలసిందే కానీ మీ కళ్ళకి కనిపించేది కాదు మోహం. ఒక అజ్ఞాని కృతజ్ఞత వాంఛించవచ్చు. జ్ఞానికి తనకంటే వేరుగా ఒకడు ఉంటే కదా కృతజ్ఞత వాంఛించటానికి, నమస్కారాలు వాంఛించటానికి.

ఈ గురువు మంచి వాడు కాదు, ఏదో గోచీ పెట్టుకొని కూర్చున్నాడు, అనుకొని నటేష్ మొదలియార్ వెళ్ళిపోయాడు. తరువాత ఎక్కడెక్కడో చాలా మంది దగ్గరికి వెళ్ళాడు, కానీ అక్కడ మనస్సు నిలబడటం లేదు. దేశంలో చాలామంది గురువుల దగ్గర తిరిగి తిరిగి మళ్ళీ ఇంటికి వచ్చేసాడు. ఏ గురువూ నచ్చలేదు అతనికి. ఇంటికి వచ్చి ఉత్తరాలు రాసాడు. నేను ఫలానా అప్పుడు వచ్చాను మీరు మాట్లాడలేదు. నాకు మీ దగ్గరికి రావాలని ఉంది. మీరు మాట్లాడతాను అంటే వస్తాను అని భగవాన్‌కు ఉత్తరాలు వ్రాసాడు. ఉత్తరాలు రాస్తే ఆ ఉత్తరాలకి సమాధానం లేదు. తరువాత రిజిష్టర్డ్ ఉత్తరం రాసాడు నటేష్ మొదలియార్. ఆ రిజిష్టర్ ఉత్తరం చూసి భగవానుకి స్కందాశ్రమంలో ఎవరో చెప్పారు, ఇలా నటేష్ మొదలియార్ ఉత్తరం రాసాడని, మీ దగ్గరికి చాలా సార్లు వచ్చారటండీ అంటే సరి సరి అన్నారు భగవాన్. వాళ్ళు సమాధానం ఏం రాసారంటే, భగవాన్ ఉత్తరాలు రాయరు. మీకు చూడాలని ఉంటే మళ్ళీ ఒకసారి రండి, ఇదివరకు ఒకసారి వచ్చాను అంటున్నారు కదా, మళ్ళీ ఒకసారి వచ్చి చూసి వెళ్ళండి.

నటేష్ మొదలియార్‌కి లెటర్ అందిన ఆ రాత్రి స్వప్నంలో దర్శనం ఇచ్చారు భగవాన్. "నటేష్ మొదలియార్ ఎందుకు నన్ను చింతిస్తావు ఎందుకు అస్తమానూ నువ్వు నా గురించి ఆలోచిస్తావు, అరుణాచలేశ్వరుడిని ధ్యానం చెయ్యి. నన్ను ధ్యానం చేస్తే నీకు ఏమొస్తుంది? అరుణాచలేశ్వరుడిని ధ్యానం చెయ్యి. అరుణాచలేశ్వరుడిని స్మరించు, నన్నెందుకు నువ్వు ధ్యానం చేస్తావు నటేష్ మొదలియార్" అన్నారు స్వప్నంలో. మీరు ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావచ్చు అని స్కందాశ్రమం నుంచి ఉత్తరం వచ్చాక నటేష్ మొదలియార్ వచ్చాడు. వచ్చి ఏం చేసాడంటే - అరుణాచలేశ్వరుడిని స్మరించు, నన్ను స్మరిస్తే నీకేమొస్తుంది, అరుణాచలేశ్వరుడి అనుగ్రహం నీమీద ఉంటే నా అనుగ్రహం ఉన్నట్టే అన్నారు కదా భగవాన్. ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే, నా అనుగ్రహం ఆటోమెటిక్‌గా నీకు వస్తుంది, ప్రత్యేకంగా నువ్వు అడగక్కరలేదు అన్నారు అని - ముందు అరుణాచలేశ్వరుడి దగ్గరికి వచ్చి అరుణాచలేశ్వరుడిని దర్శనం చేసుకొని స్కందాశ్రమానికి వెళ్ళకుండా ఒక రోజు అక్కడే ఉంటాడు నటేష్ మొదలియార్. ఇక్కడే మీరు గ్రహించాలి! నేను ఇలా స్కందాశ్రమం వెళ్తున్నానండీ, ఈ రోజుకి అరుణాచలేశ్వరుడి టెంపుల్‌లో కాలక్షేపం చేసి రేపు వెళ్తాను దర్శనానికి, ముందు అరుణాచలేశ్వరుడిని దర్శనానికి వచ్చాను, అని అక్కడ ఎవరో పంతులు గారితో చెప్పాడు. అప్పుడు ఆ పంతులు గారు అన్నారు, నువ్వు ఎందుకు వెళ్తున్నావు ఆ గురువు దగ్గరికి, నీకు ఇంతకంటే మంచి గురువు ఈ దేశంలో ఎవరూ దొరకలేదా? రమణస్వామి దగ్గరికి వెళ్ళి, నువ్వు తల బద్దలుకొట్టుకో, నువ్వు ఎందుకు తల బద్దలుకొట్టుకొంటున్నావు అని నిన్ను పలకరించి మాట్లాడడు. ఎందుకు ఆ గురువు? నేనూ చాలాసార్లు వెళ్ళాను ఆ గురువు దగ్గరికి, నాకేమీ ప్రయోజనం కనబడలేదు. కొండలో అనేక రాళ్ళు ఉన్నాయి, స్కందాశ్రమం దగ్గర ఒక రాయికేసి నీ తల కొట్టుకుంటావనుకో, నువ్వు ఎందుకు కొట్టుకుంటున్నావు అని అడగడు. అటువంటి గురువు దగ్గరికి ఎందుకు వెళ్తున్నావు నువ్వు? నిజమే కదా మరి, బాహ్యంగా చూస్తే అంతే!

గురువు అంటే ఎవరు? మీ స్వరూపమే గురువు. జ్ఞాని అంటే ఎవరు? మీ స్వరూపమే జ్ఞాని. మీరు జ్ఞానిని ప్రేమిస్తున్నారు అంటే మీ స్వరూపాన్ని మీరు ప్రేమిస్తున్నారు అని అర్థం. గురువుని ప్రేమిస్తున్నారు అంటే మీ స్వరూపాన్ని ప్రేమిస్తున్నట్టు అర్థం. మీ స్వరూపానికి వేరుగా గురువు లేడు, మీ స్వరూపానికి వేరుగా జ్ఞాని లేడు, మీ స్వరూపమే నిజమైన జ్ఞాని. ఆ రోజున గుడిలో గడిపి, మరుసటి రోజున భగవాన్ దగ్గరికి వెళ్ళాడు నటేష్ మొదలియార్. భగవాన్ చూసాడు, మాట్లాడలేదు. నటేష్ మొదలియార్ వెళ్ళేసరికి భోజనానికి

లేస్తున్నారు భగవాన్, ఊరికే చూసారు. ఇక్కడ ఇందులో చిన్న రహస్యం ఉంది. మన గురువు నిజమైన గురువు అయితే మన ప్రారబ్ధ వాసనలను బయటకు గెంటేస్తాడు. ఏ వాసనలైతే ఏ సంస్కారాలైతే మనకి జన్మలని తీసుకొస్తున్నాయో ఆ వాసనలు అన్నీ తీసేస్తాడు. అది గురువు యొక్క అనుగ్రహం. ఏదైతే నిజమో, ఏదైతే ట్రూత్తో అక్కడికి తీసుకెళ్లటానికి నిజమైన గురువు ప్రయత్నం చేస్తాడు. మీరు ప్రేమించే గురువు నిజమైన గురువు అయితే మీ ప్రారబ్ధ వాసనలని మార్చి, మీకు సరైన డైరెక్షన్ చూపిస్తాడు. లోపల గురువు యొక్క అనుగ్రహం ఎంత బలంగా మీలో పనిచేస్తోందో, మీకు అంతర్ముఖదృష్టి కనుక ఉంటే లోపల గురువు చేసే పని మీకు తెలుస్తూ ఉంటుంది.

సోదర మహాశయులారా! భగవంతుడు ఉన్నాడా లేడా అని మీకూ నాకూ అనుమానం వస్తూ ఉంటుంది. ఇక్కడ కూర్చున్నప్పుడు మీకూ బాగానే ఉంది, నాకూ బాగానే ఉంది. ఇంటికి వెళ్లిపోయిన తరువాత మనం ఒక్కోసారి ఒంటరిగా కూర్చున్నప్పుడు ఏమనిపిస్తుంది - భగవంతుడు ఉన్నాడా, లేడా, నిజంగా ఆత్మ అనేది ఒకటి ఉందా, లేదా ఇటువంటి అనుమానాలు వస్తూ ఉంటాయి. మీకెవరికీ రావటం లేదా ఇటువంటి అనుమానాలు? మీరు ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చున్నప్పుడు ఇటువంటి అనుమానాలు వస్తున్నాయా? భగవంతుడు నిజంగా ఉన్నాడా లేడా? భగవంతుడు ఉన్నాడని విశ్వాసం ఉంది కాబట్టి మీరందరూ ఇక్కడికి వచ్చారు. కానీ ఒక్కోసారి లేడు అనిపిస్తూ ఉంటుంది. ఆత్మ ఉందని చెపుతున్నాడు భగవంతుడు గీతలో, నిజంగా ఉందా? మన వాసనలే మనకి కనిపిస్తున్నాయి, మన తలంపులే మనకి కనిపిస్తున్నాయి, మన నామరుపాలే మనకి కనిపిస్తున్నాయి. ఈ నామరూపాలని దాటి, మన తలంపులని దాటి వెళ్లలేని మన దృష్టికి ఆత్మ అంటే ఏమిటో భగవంతుడు అంటే ఏమిటో ఏం తెలుస్తుంది? మీకు ఇంటివద్ద అనుమానాలు రావటంలేదా ఎప్పుడూ, భగవంతుడు ఉన్నాడా లేడా? ఆత్మ అనేది ఉందా లేదా? అసలు చచ్చిపోయిన తరువాత బూడిద అయిపోతాము కానీ, తరువాత జీవితం ఉందా లేదా? ఇటువంటి సందేహాలు మీకు ఎప్పుడైనా వస్తున్నాయా? ఇటువంటి సందేహాలు మనకి ఎందుకు వస్తాయంటే పూర్వజన్మలలో మనం చేసినటువంటి దుష్టకర్మ సందేహ రూపంలో వస్తుంది. మనకొచ్చే సందేహమే రాక్షసుడు. మనకి వచ్చే సందేహమే మనల్ని నాశనం చేస్తుంది.

మనిషి ఎంత దురాచారుడు అయినప్పటికీ, విశ్వాసం విషయంలో మట్టుకు చలనం

లేకపోతే వాడిని ఉద్ధరించి తీరతాను అన్నాడు భగవద్గీతలో వాసుదేవస్వామి. వాడు దురాచారుడు అయ్యి ఉండవచ్చు. ఎవడికైతే విశ్వాసంలో చలనం లేదో వాడిని ఉద్ధరించి తీరతాను అన్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. వాడికి రక్షణ ఇస్తాను అన్నాడు. వాడు ఎక్కడ ఉన్నా ఏ రూపంలో ఉన్నా ఏ జన్మలో ఉన్నా, మానవదేహం అవ్వనివ్వండి పశుదేహం అవ్వనివ్వండి, ఎక్కడ ఉన్నా సరే, వాడి విశ్వాసంలో కనుక చలనం లేకపోతే, నా రక్షణ నా ప్రొటెక్షన్ ఎప్పుడూ ఉంటుంది అని చెప్పాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎవరు సహకరిస్తారండీ, ఒంటరిగా ప్రయాణం చెయ్యాలండీ ఈ జీవితం. ఇదంతా వేళాకోళం అనుకోకండి, సబ్జెక్టుని మీరు సీరియస్‌గా తీసుకోండి, మీరు వేళాకోళంగా తీసుకోకండి. ఇట్ ఈజ్ నాట్ ఏ జోక్. చాలా సీరియస్‌గా ఆలోచించండి. ఎవరు సహకరిస్తారండీ మనకి? బంధువులు సహకరించరు, స్నేహితులు సహకరించరు, విరోధులు సహకరించరు, మన మార్గంలో ఎవరో ఏదో సహకరిస్తారని ఎప్పుడూ ఊహించవద్దు. ఊహిస్తే డిజప్పాయింట్ అవుతారు. నిజంగా మీరు ఆధ్యాత్మికంగా సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తున్నారు అనుకోండి - ఎందుకమ్మా నీకా గొడవలు, ఆధ్యాత్మిక దృష్టి ఎందుకు? మామూలుగా ఉండు, ఏదో లోకంతోపాటు ఉండాలి కానీ ఆధ్యాత్మికంగా కృషి చెయ్యటం ఎందుకు? అంటూ మీ బంధువులు అందరూ మిమ్మల్ని నిరుత్సాహపరుస్తారు. మీరు నిజంగా చేస్తున్నట్టయితే! అందుకే అబద్ధం అబద్ధంగా చెయ్యమంటున్నాను. మీరు అబద్ధం అబద్దంగా చేస్తే డేంజర్ లేదు. కానీ సిన్సియర్‌గా కనుక మీరు చెయ్యటం మొదలుపెడితే మీ బంధువులు అందరూ మిమ్మల్ని నిరుత్సాహపరుస్తారు. ఇంకా దేవతలు ఏం చేస్తారంటే, వీడేదో ఆత్మని తెలుసుకుంటాను అంటున్నాడు వీడి సంగతి ఏంటో చూద్దామని మనకేవో కొన్ని పరీక్షలు సృష్టిస్తారు. ఇంకెవరు మనకి సహాయం చేసేది? దేవతల సహకారం లేదు, స్నేహితుల సహకారం లేదు, బంధువుల సహకారం లేదు, విరోధుల సహకారం అంతకన్నా లేదు. ఇంకెవరు సహకారం మనకి, ఈ ఆధ్యాత్మిక మార్గంలో? ఎవరి సహకారం తీసుకొని మనం ముందుకు వెళ్ళేది? మనకి సపోర్ట్ ఏది? మనం నిలబడలేకపోతే కర్ర పుచ్చుకోవచ్చు చేతిలోకి. కళ్ళు కనిపించకపోతే కళ్ళజోడు పెట్టుకున్నాము. మరి దీనికి సపోర్ట్ ఏది? ఎవరూ మనకి సహకారం లేనప్పుడు ఏ ఆధారం వల్ల మనం ముందుకు వెళ్ళాలి? ఒకటే ఆధారం, ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ, మనని నిలబెట్టి ఉంచేది ఒకటే ఆధారం - అది భగవంతుడి యందు చలనం లేని విశ్వాసం. ఈశ్వరుడి పట్ల అచంచలమైన విశ్వాసం, దృఢమైన విశ్వాసం! గాలి వేస్తే కొట్టుకుపోయే విశ్వాసం లాంటిది కాదు, దృఢమైన విశ్వాసం! బహులోతైన విశ్వాసం, విశాలమైన విశ్వాసం!

అటువంటి విశ్వాసం కనుక, అటువంటి ఫర్మ్ ఫెయిత్ మన హృదయంలో కనుక ఉంటే, ఇప్పుడు నేను చెప్పినటువంటి స్ట్రగుల్స్, ఇంతకుముందు చెప్పిన ఎన్నిరకాల ఆటంకాలు వచ్చినప్పటికీ, ఆ విశ్వాసం ఈ ఆటంకాలని తట్టుకొని నిలబెడుతుంది. అటువంటి విశ్వాసం మన హృదయానికి నేర్పాలి. ఎవరూ సహకరించరండీ, మీరు అనుకోవద్దు ఎవరో సహకరిస్తారని. మీరు సిన్సియర్‌గా కనుక ప్రయత్నం చేస్తూ ఉంటే, ఎవళ్ళూ సహకరించరు. మీ ఇంట్లోవాళ్ళు కూడా మీకు సహకరించరు. సుఖమూ దుఃఖమూ పుణ్యమూ పాపమూ ఇదంతా ఫారెస్ట్. మీరు ఈ అడవిలో పడిపోవద్దు.

సుఖం ఎవరికీ, అహంకారానికి; దుఃఖం ఎవరికి, అహంకారానికి; పుణ్యం ఎవరికీ, అహంకారానికి; పాపం ఎవరికీ, అహంకారానికి; ఈ లోకం ఎవరికీ, అహంకారానికి; పరలోకం ఎవరికీ, అహంకారానికి; స్నేహితులు ఎవరికీ, అహంకారానికి; విరోధులు ఎవరికీ, అహంకారానికి; బంధువులు ఎవరికీ, అహంకారానికి; ఇదంతా అహంకారానికే! దీనిని దాటకపోతే ఎవడూ జ్ఞాని కాలేడు. మీరు పుణ్యం సంపాదించాలంటే సంపాదించండి, పాపం కంటే పుణ్యం మంచిదే. కానీ అదీ ఖర్చు అయిపోతుంది, అది నిజం కాదు; నిజం కాదు కాబట్టి అది ఊడిపోతుంది. అది గమ్యం కాదు. జ్ఞానం మన గమ్యం. పుణ్యం మంచిదే కానీ గమ్యం మట్టుకు కాదు. గోల్ ఏమిటి? మన లక్ష్యం ఏమిటి? మన డెస్టినేషన్ ఏమిటి? మీరు తరువాత ప్రయాణం చేద్దురుగాని. అసలు ముందు ఎక్కడికి వెళ్ళాలని? మనం ఏ వస్తువుని పొందాలి? మన లక్ష్యం ఏమిటి? మన గమ్యస్థానం ఏమిటో ముందు ఒక నిర్ణయానికి రండి, తరువాత ప్రయాణం చెయ్యవచ్చు. ఎక్కడ ఏ ఊరు వెళ్ళాలో మనస్సులో నిశ్చయించుకోకుండానే ముందే మీరు ప్రయాణం చేసేస్తారా? భగవంతుడి పట్ల అచంచలమైన విశ్వాసం ఉన్నవాడు తెలివైనవాడా, విశ్వాసం లేనివాడు తెలివైనవాడా? భగవంతుడిపట్ల విశ్వాసం ఉన్నవాడు తెలివైనవాడా, లేకపోతే భగవంతుడి పట్ల విశ్వాసం లేనివాడు తెలివైనవాడా? ఎవడు వైజ్‌మాన్? ఎవడు ఫూలిష్‌మాన్? విశ్వాసాన్ని చలింపచేసేది కూడా మనలో ఉన్న దుర్వాసనలే; దీనికి పూర్వజన్మలలో మనం చేసిన దుష్టకర్మే కారణం. లోపల వాసనలు వీకెన్ అవ్వాలి. అది మెయిన్. అది జరుగుతోందో లేదో లోపల చూసుకోండి. లోపల జరుగవలసిన పని జరుగుతోందో లేదో చూసుకోండి మీరు. గురువు అనుగ్రహమూ ఈశ్వరానుగ్రహమూ ఎప్పడు ఉన్నట్టు అంటే, మీ లోపల ఉన్న అహంకారం ఎంతవరకూ బలహీనపడుతోంది ఎంతవరకూ పలచబడుతోంది, దాని బలం ఎంతవరకూ తగ్గుతోంది. అహంకారం అనే రోగం యొక్క బలం ఎంతవరకూ

తగ్గుతోంది చూసుకోండి. మీరు బయట చేసుకునే పూజలు నోముల వల్ల మీ అహంకారం పెరుగుతుంటే మీరు వెనక్కి వెళ్తున్నట్టా, ముందుకు వెళ్తున్నట్టా? మీరు చేసే పూజలు చేసుకోండి, మీరు చేసే వ్రతాలు చేసుకోండి, మీరు చేసే ఉపవాసాలు చేసుకోండి, మీ లోపల ఏం జరుగుతోంది? అహంకారం యొక్క బలం పెరుగుతోందా, లేకపోతే అహంకారం యొక్క బలం తగ్గుతోందా? అది చూసుకోండి. అహంకారం యొక్క బలం తగ్గేకొలదీ మీరు ఈశ్వరుడి యొక్క హృదయంలోకి వెళ్తారు. ఈశ్వరుడికి దగ్గర అవుతారు.

మనకి పొలం ఉంది, ఉద్యోగం ఉంది, వృత్తి ఉంది, ఇల్లు ఉంది, బంధువులు ఉన్నారు, స్నేహితులు ఉన్నారు, డబ్బు కావలసి ఉంటే అప్పు ఇచ్చేవాళ్ళు ఉన్నారు, మనకి అనేక ఆధారాలు ఉన్నాయి. మనకి అనేక ఆధారాలు ఎదురుగుండా కనిపిస్తుంటే - అనేక దిక్కులు, అమ్మ దిక్కు ఉంది. మీకందరికీ మేనమామలు దిక్కు ఉన్నారు, భర్తలు దిక్కు ఉన్నారు, మీ తల్లితండ్రులు మీకందరికీ దిక్కు - ఇలా మనందరికీ తలొక దిక్కు ఉంది, దేవుడు దిక్కు ఎలా అవుతాడు మనకి? ఏ దిక్కూ లేనివాడికి దేవుడు దిక్కు. ఏ ఆధారము లేని వాడికి దేవుడు ఆధారం. మనకి అన్ని ఆధారాలూ ఎదురుగుండా కనిపిస్తుంటే, అన్ని దిక్కులూ ఎదురుగా కనిపిస్తుంటే, దేవుడు దిక్కు దేవుడు ఆధారమూ అంటే ఎవరు నమ్ముతారు? నగ్నంగా ఎవడు వెళ్తాడు ఈశ్వరుడి దగ్గరికి? ఈ దిక్కులతోటి ఈ ఆధారాల తోటి వీటన్నిటితో మన అహంకారాన్ని అలంకరించుకొంటూ మీరే దిక్కని పాటలు పాడుతుంటే, మన హృదయంలో ఎవరిని నమ్ముతున్నామో దేవుడికి తెలియదా? నువ్వే దిక్కని నేను పాట పాడాను అనుకోండి, నోటితోటి పాడవచ్చు, కానీ హృదయము ఎవరిని దిక్కని నమ్ముతోందో ఈశ్వరుడికి తెలియకుండా ఉన్నాడా? అందుకే ఒక ఉపనిషత్తులో చెప్పబడింది, ఈశ్వరుడు తాను తెలియబడటం కోసం ఎవడినైతే సెలెక్ట్ చేసుకున్నాడో, వాడికే తెలియబడతాడు. నువ్వు ఈశ్వరుడిని సెలెక్ట్ చేసుకోవటం కాదు, ఈశ్వరుడు ఎవడినైతే వరించాడో, ఈశ్వరుడు ఎవడికైతే తెలియబడాలి అనుకున్నాడో వాడికే తెలియబడతాడు. మనం తెలుసుకోవాలంటే తెలియబడడు, ఆయన అనుకోవాలి ఫలానా వ్యక్తికి నేను తెలియబడాలని. ఎవడికైతే తెలియబడాలి అనుకున్నాడో ఈశ్వరుడు, వాడికి తెలియబడతాడు.

మనం చేసే పనులు మన అహంకారం సంతోషించటం కోసం, ఎదుటివాళ్ళ అహంకారం సంతోషింప చెయ్యటం కోసం చేస్తున్నామా, లేకపోతే ఈశ్వరుడి సంతోషం కోసం చేస్తున్నామా? సోదరమహాశయులారా! మనం చేసే పనులు ఈశ్వరుడి ప్రీతికోసం,

ఈశ్వరుడి సంతోషం కోసం, ఈశ్వరుడి హృదయంలో చేరుకోవటం కోసం, ఏ పనైనా చెయ్యగలిగామా జీవితంలో? ఈశ్వరుడు హృదయాన్ని ముట్టుకోవటం కోసం, ఈశ్వరుడికి దగ్గరగా వెళ్ళే పని, ఏ పనైనా జీవితంలో చెయ్యగలిగామా? అనేక పనులు చేసాము ఇంతవరకూ జీవితంలో. పని లేకుండా మనిషి ఉంటాడా, ఏదో ఒక పని చేస్తూనే ఉంటాడు మనిషి. పని లేకుండా మనిషి ఉండలేడు. అయితే మీరు చేసే పనులలో ఏ పని ఈశ్వరుడి హృదయానికి తాకింది? మనం ఈశ్వరుడి హృదయానికి గాయాలు చేస్తున్నామా? ఈశ్వరుడు చెప్పినట్టుగా నడుచుకోకపోతే ఈశ్వరుడి హృదయానికి గాయం చేసినట్టు! ఈశ్వరుడు చెప్పినట్టుగా నడుచుకుంటే, ఈశ్వరుడు సంతోషిస్తాడు. ఆయన సంతోషిస్తే ఆయనకి అసాధ్యం అనేది ఉండదు, మనకి జ్ఞానం ఇవ్వటం ఎంతసేపు! మన డిక్షనరీలో అసాధ్యం ఉంది కానీ ఈశ్వరుడి డిక్షనరీలో అసలు అసాధ్యం ఉండదు. ఈశ్వరుడికే కనుక సంతోషం కలిగితే, మనకి జ్ఞానం ఎంతసేపు వస్తుంది? అయితే ఈశ్వరుడి హృదయానికి సంతోషం కలిగే పని మనం ఒక్కటి చెయ్యగలిగామా?

భక్తి పేరుమీద మనం అహంకారాన్ని అలంకరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. మొదలు కల్పించేది మనస్సు చివర కల్పించేది మనస్సు, అందుచేత ఆది అనాది అంతా మనస్సే, ఇందులోంచే అజ్ఞానం పుట్టింది, మనస్సు లేకపోతే అజ్ఞానం లేదు. అంటే మనస్సుని మింగాలి మనం. మన మనస్సుని మింగటానికి యోగం, మనస్సు చెప్పినట్టు నడిచేవాడు భోగి. మనస్సుని మింగటానికి ప్రయత్నం చేసేవాడు యోగి. ఈ మోక్షం, బంధం, ఇదంతా కూడా మనస్సు యొక్క కల్పితమే. నాకు మోక్షం కావాలి, మోక్షం కావాలి అంటారు. అది కూడా మనస్సు కల్పితమే. బంధం కూడా మనస్సు యొక్క కల్పితమే. ఇదంతా మనస్సు చేసే ఆట! మనస్సు కల్పించే ఒక చక్కటి అడివి ఇది.

సత్యనారాయణస్వామి అనే ఒక భక్తుడు 1924వ సంవత్సరంలో భగవాన్ దగ్గరికి వచ్చాడు. అప్పటికి ఆశ్రమం లేదు, ఏదో చెట్టుకింద కూర్చునేవారు భగవాన్. చెట్టుకిందే భోజనం, పడక, అన్నీ చెట్టుకిందే. సత్యనారాయణస్వామి భగవాన్ చుట్టూ చాదస్తంగా తిరుగుతున్నాడంట. అప్పుడు భగవాన్ అన్నారు ఈ ప్రదక్షిణాల వల్ల చివరికి నీకు ప్రయాస మిగులుతుంది. ప్రశాంతంగా కూర్చుని ఒక క్షణం కూడా వృధా చెయ్యకుండా, నేను ఎవడనని విచారణ చేసుకో. ఈ ప్రదక్షిణాల వల్ల నీకు మిగిలేది ప్రయాస. స్టే విథిన్! ఊరికే ప్రశాంతంగా కూర్చుని విచారణ చెయ్యి.

ఒకసారి భగవాన్ అక్కడేదో పని జరుగుతోంటే ఆయన ఇటుకలు మోస్తున్నారు. ఈ సత్యనారాయణ స్వామి కూడా ఇటుకలు మోస్తున్నాడు. అప్పుడు ఇతను అనుకొన్నాడట మనస్సులో, భగవాన్ ఏవిధంగా అయితే ఇటుకలు మోస్తున్నారో, అదేవిధంగా నా ప్రారబ్ధాన్ని కూడా మోస్తే ఎంత బాగుండును. భగవాన్ ఇటుకలే మోస్తున్నారు. ఆ ఇటుకలు మోస్తే ఏం గొప్ప నా ప్రారబ్ధాన్ని మొయ్యాలి కానీ, అని ఊరికే తలంపు వచ్చింది. పైకి అడగలేదు. భగవాన్ వెంటనే ఆయన చేతిలోని ఇటుకలు పక్కన పెట్టి, "సత్యం, నీ చేతిలో ఉన్న ఇటుకలు నా చేతికి ఇయ్యి" అన్నారు. ఫలహారాల మీద ఉన్న ధ్యాస పరం మీద ఉంటే వచ్చేస్తుంది మోక్షం. అంతకంటే ఎక్కువ శ్రమ పడక్కరలేదు. ఈ ఫలహారాలు, స్వీట్స్, వీటిమీద మీకేవో లైకింగ్స్ ఉంటాయి కదా! ఫలహారాల మీద ఉన్న ధ్యాస పరం మీదకి మళ్ళిస్తే చాలు. ధ్యాస ఉంది, దాన్ని మళ్ళించటమే చెయ్యాలి. ధ్యాస లేకుండా మనిషి ఎలా ఉంటాడు; దాన్ని మళ్ళించటమే కావాలి! భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. ఎవడైతే తన శరీరావసరాలకి ఎదుటివాళ్ళ మీద ఆధారపడకుండా తన పని చేసుకొంటూ మిగతా కాలం అంతా నాకోసం ఎవడైతే ఖర్చు పెడుతున్నాడో, వాడు పరమస్థితిని పొందుతాడు. ఎవడైతే తన దేహయాత్రకి, తన దేహపోషణకి, ఎదుటివాళ్ళ మీద ఆధారపడకుండా తన పని తాను చేసుకొంటూ మిగతా కాలాన్ని అంతా కూడా నన్ను తెలుసుకోవటానికి ఎవడైతే ఖర్చు పెడుతున్నాడో వాడు పరమస్థితి పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు.

సోదరమహాశయులారా! మనకన్నీ కోరికలు, వాంట్స్ వాంట్స్ వాంట్స్! భగవంతుడు చెప్పేది అవసరాలు, నీడ్స్ నీడ్స్ నీడ్స్! మనం అవసరాలతో సంతృప్తి పడలేము, మనకి కోరికలు కావాలి. జీవితంలో మనకి అవసరాలు వేరు, కోరికలు వేరు. అవసరాలు తేలికగా వచ్చేస్తాయి, తక్కువ శ్రమతోటి మనకి అవసరాలు వచ్చేస్తాయి. కానీ మనం కష్టపడి కృషి చేసేది అవసరాల కోసం కాదు, మన కోరికలు నెరవేరాలి. మనకి అవసరాలు నెరవేరితే, మనం సంతృప్తి పడతామా, సంతృప్తి పడం! మనకి కోరికలు నెరవేరాలి, అవసరాలు కాదు! ఇప్పుడు మనకి ఏమీ లోటు లేదు అనుకోండి మాటవరసకి, మన అవసరాలు నెరవేరుతున్నాయి కదా, అయితే సంతృప్తిగా ఉన్నామా? లేదు, ఎందుచేతనంటే మనకున్నవి కోరికలు, నీడ్స్ కాదు, కోరికల గురించి ఎక్కువ మనం ప్రయత్నం చేస్తున్నాము. ఎక్కడైతే బంధం ఉందో అక్కడ భయం ఉంటుంది. బంధం లేని వాడికి భయం ఏంటి? బంధం లేని వాడికి ద్వేషం ఏంటి? బంధం లేని వాడికి అసూయ ఏంటి? బంధం లేనివాడికి చీకటి ఏంటి? బంధం

లేని వాడికి చావు ఏంటి? మీ హృదయంలో కనుక నిజంగా బంధం లేకపోతే, నో ఫియర్! భయం అనేది లేదు. ఒక మనిషి మీదో, లేకపోతే మన దేహం మీదో, బయటికి కనిపిస్తున్నటువంటి పదార్థాల మీదో అటాచ్‌మెంట్ ఉండటం వల్ల మనకి విపరీతమైన భయం పుట్టుకొస్తుంది. మనకి మరణం వస్తూ ఉంటే, శరీరం పోతోందని భయం ఎందుకు వేస్తోంది, శరీరం మీద అటాచ్‌మెంట్ వల్ల భయం వస్తోంది. ఈ శరీరం మీద కనుక నాకు అటాచ్‌మెంట్ లేకపోతే ఇంక భయం లేదు. ఎక్కడైతే బంధం ఉందో అక్కడ భయం వచ్చి తీరుతుంది, ద్వేషం వచ్చి తీరుతుంది, అసూయ వచ్చి తీరుతుంది, పగ వచ్చి తీరుతుంది. రోగ నిర్ధారణ మనకు ముఖ్యం.

అందరికీ భయం వేస్తోంది, ఎందుచేత మనకి భయం వేస్తోంది? ద్వేషం వస్తోంది, ఎందుచేత ద్వేషం వస్తోంది, కక్ష వస్తోంది, ఎందుచేత కక్ష వస్తోంది. సందేహాలు వస్తున్నాయి, ఎందుచేత ఇవి అన్నీ వస్తున్నాయి? లోపల సందేహించేవాడు ఎవడు? లోపల అనుమానించేవాడు ఎవడు? లోపల ద్వేషించేవాడు ఎవడు? అనుమానించే వాడు లేకుండా అనుమానం వస్తుందా? సందేహించేవాడు లేకుండా సందేహం వస్తుందా? ద్వేషించేవాడు లేకుండా ద్వేషం వస్తుందా? మీ కాలాన్ని పాడు చేసుకోకండి, మీ శక్తిని పాడు చేసుకోకండి, మీ తెలివితేటలని వృథా చేసుకోకండి. మీరు ఏ వస్తువు కోసం అయితే వెదుకుతున్నారో, ఆ వస్తువు ప్రత్యక్షంగా మీ హృదయంలో ప్రకాశిస్తోంది. ఎందుకు మీకు శ్రమ, అనవసరంగా మీ శక్తినంతా ఖర్చు పెట్టుకోవద్దు. మీ రూపాయలని ఖర్చు పెట్టుకోవద్దు మీ కాలాన్ని ఖర్చు పెట్టుకోవద్దు, మీరేమీ కష్టపడవద్దు. మీరు వెదుకుతున్న వస్తువు మీ హృదయంలోనే ప్రకాశిస్తోంది, దానికి చావు లేదు. దేహానికి చావు రాకముందే ఎవడైతే చస్తున్నాడో వాడికి చావులేని వస్తువు అందుతుంది. చావు రాకముందే ఎవడైతే చస్తున్నాడో వాడికి హృదయంలో ఉన్న చావులేని వస్తువు అందుతుంది. వాడు ప్రకృతిని దాటుతాడు, చీకటిని దాటుతాడు. అసత్యంలోంచి సత్యంలోకి వెళ్తాడు. మృత్యువులోంచి అమృతస్థితికి వెళ్తాడు, అశాంతిలోనుంచి శాంతిలోకి వెళ్తాడు, మీరు వెదుకుతున్న వస్తువు మీ హృదయంలోనే ఉంది. మీరేమీ కష్టపడవద్దు. స్వర్గరాజ్యం మీలోనే ఉంది అని ఏసు చెప్పాడు.

మీ ఆత్మతోటి సహవాసం చెయ్యటమే నిజమైన సత్సహవాసం. సత్పదార్థం మీ ఆత్మే, దానితోటి సహవాసం చెయ్యటమే సత్సహవాసం. ఈశ్వరానుగ్రహం కనుక లేకపోతే మనం

కష్టపడి ఒక్క వాసనను కూడా బయటికి గెంటుకోలేము. ఈశ్వరానుగ్రహం, గురువు అనుగ్రహం లేకపోతే, ఒక్క దుష్టవాసన కూడా బయటికి రాదు. జీవితం పొడుగునా మనం బానిసలమే. ఏదో ఒక వస్తువుకో, మనుషులకో మనం బానిసత్వం చేస్తూ మరణిస్తున్నాము. ఇటువంటి బానిసలకా జ్ఞానం కలిగేది! భగవాన్ చెప్పేది ఏమిటంటే, భగవంతుడు ఎంతకాలం అయితే ఈ శరీరం ఉంచదలుచుకున్నాడో ఆ రోజు వరకూ ఈ శరీరం అలాగే నిలబడి ఉంటుంది. అంటే నీ ఖర్మ, జన్మాంతరంలో నువ్వు చేసుకున్న సుకృతమో నిష్కృతమో, ఈ శరీరం ద్వారా ఖర్చు అయిపోతూ ఉంటుంది. ఆ ప్రారబ్ధకర్మే నిన్ను పోషిస్తుంది. అది గాడ్స్ వర్క్! భగవాన్ తల్లి అక్కడికి వచ్చే భక్తులతో భగవాన్‌కి తెలియకుండా అవి తెండి, ఇవి తెండి అని చాటుగా చెప్పేది. అప్పుడు భగవాన్ చెప్పారు స్పష్టంగా మనం ఏది తినవలసి ఉందో అది వస్తుంది. మనం తినవలసిన యోగం ఉంటే, అది ఎవరితోటలో పండినా, వారికి సంకల్పం వస్తుంది ఫలానా వారికి ఇది ఇవ్వాలని, పట్టుకొచ్చి ఇస్తారు. మనం తినే యోగం లేదనుకోండి, చెప్పినా రాదు. భగవాన్ చూడండి, ఆయన తిండి లేకుండా ఉన్న రోజులు ఉన్నాయి; అవతారపురుషుడికి ఉండవలసిన వైభవమంతా జరిగిపోయింది చివరి రోజులలో. అదే భగవాన్ అనేవారు, ఈ శరీరం యొక్క ప్రారబ్ధకర్మలో అప్పుడు అలా ఉండవలసి వచ్చింది, ఇప్పుడు ఇలా ఉండవలసి వచ్చింది. కొంతమంది చూడండి కొంతకాలం జీవితంలో ఎంతో దరిద్రం అనుభవిస్తారు తరువాత ఐశ్వర్యవంతులు అవుతారు కొంతమంది ముందు ఐశ్వర్యం అనుభవిస్తారు, తరువాత దరిద్రం అనుభవిస్తారు. ముందు కొంతమంది చాలా సుఖాలు అనుభవిస్తారు, తరువాత కష్టాలు వస్తాయి. కొంతమందికి ముందు కష్టాలు వస్తాయి, తరువాత సుఖపడతారు. మన రోజులు వెళ్ళాలి, వెళ్ళినవి అనుకోవాలి అని మన పెద్దలు చెపుతుంటారు చూడండి. ఏమో చివరిరోజు వరకూ ఈ శరీరంతో ఏమి జరగాలని ఉందో?

శక్తి ఈశ్వరుడిది, నీ కోరికకి శక్తి లేదు. నువ్వు కోరితేనే వస్తువు వస్తుంది అనుకోకు, నువ్వు కోరకపోయినా నీకు రావలసి ఉంటే వస్తుంది. అదీ ప్రారబ్ధం యొక్క సిద్ధాంతం. నీకు కోరిక ఉంటేనేకానీ ఆ పని జరుగదు అనుకొంటున్నావు. అది పొరపాటు. కోరిక లేకపోయినా నీ ఒంటిమీద అది జరుగవలసి ఉంటే అది జరిగిపోతుంది. ఒకవేళ నీ ఒంటిమీద ఆ యోగం లేదనుకో, ఆ భోగం లేదనుకో, నువ్వు కోరినా రాదు. ఈ శరీరాన్ని నడిపించేది ప్రారబ్ధకర్మ! పోనీ ఏది అనుభవిస్తే ఏమిటండీ, ఈ శరీరం సుఖం అనుభవిస్తే ఏముంది? కష్టం అనుభవిస్తే ఏముంది? నిజమా ఇదంతా? ప్రారబ్ధకర్మే శరీర యాత్రకి

కారణం. భగవానుకి ఆయన జీవితంలో గోచీ పెట్టుకునే ప్రారబ్ధం ఉంది, ఎవరి నోటివెంట్నైనా గోచీ పెట్టుకో అనే వచ్చేది చిన్నప్పుడు. ఎందుచేతంటే భగవాన్ ప్రారబ్ధంలో గోచీ ఉంది, అందుచేత చివరి రోజు వరకూ ఆయనకు గోచీయే!

రామకృష్ణుడు చెప్పాడు నరేంద్రుడితోటి, నువ్వు ఎంత పని చెయ్యకూడదు అనుకొన్నప్పటికీ, నీ ద్వారా ఎంతో పని జరుగుతుంది లోకంలో. నాకెందుకండీ ఈ పని గొడవ, నాకు సమాధిస్థితి కావాలండీ అనేవాడు నరేంద్రుడు రామకృష్ణుడితో. నాకు సమాధిస్థితి ఇవ్వండి అని అడిగేవాడు. నీకు సమాధిస్థితి వస్తుంది, నీకు రాకుండా ఆపు చెయ్యటం కోసం నేను తంటాలు పడుతున్నాను, నేను నీకు ఇవ్వటం ఏమిటి అనేవాడు రామకృష్ణుడు. సమాధిస్థితి వచ్చి నీమీద పడుతుందేమో, నీ ద్వారా కొంత పని జరగాలి లోకంలో, అందుచేత అది రాకుండా ఆపుచేస్తున్నాను. నీ ప్రారబ్ధం వల్ల, నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా నీ శరీరం ద్వారా ఎంతోకొంత పని జరుగవలసి ఉంది. నీ చివరి రోజులలో నీకు సమాధి వస్తుంది. అప్పటిదాకా సమాధి ఆగి ఉంటుంది, ఈ పని జరగటం కోసం. నీకు నలభైయవ సంవత్సరం వచ్చింది అనిపించుకోకుండా నీ శరీరం రాలిపోతుంది. అది నీ ప్రారబ్ధం. నరేన్ నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా అది జరిగిపోతుంది. అలాగే నలభైయవ సంవత్సరం రాకుండానే ఆయన శరీరం పడిపోయింది. జీవులందరూ మాయ చేతిలో ఉన్నారు, మాయ మట్టుకు పరమేశ్వరుడి చేతిలో ఉంది. ఎవడైతే పరమేశ్వరుడిని ఆరాధిస్తున్నాడో, ఎవడైతే పరమేశ్వరుడి యొక్క పాదాలు ఆశ్రయిస్తాడో వాడు మాయలోంచి బయటపడతాడు. రామకృష్ణ పరమహంస చెపుతాడు చెరువులో చేపలకోసం ఒకడు వల వేసాడు అనుకోండి, ఎవడైతే వల వేస్తున్నాడో ఆ వల వేసేవాడి పాదాల దగ్గరకి కనుక చేప వస్తే, ఆ చేప వలలో పడదు. ఈ ప్రకృతి అంతా ఒక వల, మనం కనుక పరమేశ్వరుడి పాదాల దగ్గరకి వెళ్తే ఈ వలలో పడం. అంటే ఈ మాయ అనే వలలో మనం చిక్కుకోము. రామకృష్ణుడు చెప్పేది ఎంత బ్యూటీఫుల్‌గా ఉందో చూడండి. రామకృష్ణుడి దగ్గరికి వచ్చే ఒక అమ్మగారు కాశీలో రేవు కట్టించారు. గొప్ప పుణ్య క్షేత్రం కాశీ. అక్కడ ఆవిడ రేవు కట్టించింది. ఆవిడ రామకృష్ణుడితో వచ్చి చెపుతుంది నేను రేవు కట్టించానండీ అని. ఎంత బావుంది, ఎంత మంచి పని చేసావు అంటాడు. ఎంతో పుణ్యం వచ్చేస్తుంది అని ఈవిడ లోపల ఉద్దేశం. నువ్వు రేవు కట్టించేసావా, ఎంత మంచి పని చేసావు అన్నాడు రామకృష్ణుడు. ఆవిడ నిజమే అనుకుంటోంది పాపం! రామకృష్ణుడు ఆవిడలోని అహంకారాన్ని, ఈ పుణ్యభారాన్ని బయటికి తీసుకురావటం కోసం, ఆవిడకి పొగ వేస్తున్నాడు. రామకృష్ణుడు

ఆవిడని నువ్వు చాలా గొప్ప పని చేసావు అని పొగుడుతున్నాడు. ఆవిడేమో ఇంత డబ్బు అయ్యింది అంత డబ్బు అయ్యింది అన్ని రేవులకంటే నా రేవే బాగుంది అంటున్నారు. రామకృష్ణుడే పొగుడుతున్నాడు, ఇంకేం కావాలి ఆవిడకి. ఈ పొగడ్తలా మన గమ్యం? ఈ పుణ్యమా మన గమ్యం? ఆవిడ పొంగిపోతూ రామకృష్ణుడి పాదాల మీద పడింది. ఆవిడ ఎదురుగానే రామకృష్ణుడు కాళ్ళు కడుక్కొన్నాడు అంటే కాళ్ళు అపవిత్రం అయినట్లు. అంటే ఏంటి ఆ రేవు కట్టించడం వల్ల ఆవిడకి పుణ్యం వచ్చేసింది అనుకుంటోంది, కాని చీకటిలో పడుతోంది. అంటే ఏమవుతోంది, ఆవిడకి అహంకారం పలచబపడిందా? చిక్కబడిందా? ఇక్కడ మీరు అర్థం చేసుకోవాలి. రేవు కట్టించిన మాట నిజమే, బాహ్యంగా ఆవిడకి పుణ్యం వస్తే రావచ్చు, పుణ్యం ఖర్చు అయిపోతుంది. నిజమైన గురువు అక్కడ ఆపుచెయ్యకూడదు. ఆవిడ అహంకారం పలచబడటంలేదు లోపల, నేను పుణ్యం చేసాను గొప్ప పని చేసాను అని ఆవిడ అహంకారం ఇంకా పొగరెక్కుతోంది. అది కత్తిరించాలి నిజమైనగురువు.

తలంపుకి ఖర్చు ఏముందండీ! ఎదుటి మనుషులు సుఖంగా ఉండాలి అని తలంపు వల్ల మీకు ఖర్చు ఏముంది? రూపాయలు ఖర్చు అవుతున్నాయా మీకు దాని వల్ల? ఎదుటి మనిషి సుఖంగా ఉండాలి అనే మనోహరమైన భావన వల్ల మీకు ఖర్చేముంది? మనస్సులో కూడా కోరరా మీరు? రమణస్వామి చెప్పాడు ఒక మాట, నిన్ను నువ్వు ఎంతవరకూ పవిత్రుడిని చేసుకొంటున్నావో అంతవరకూ లోకం నీ ద్వారా ఉద్ధరింపబడుతుంది, నువ్వు ప్రత్యేకంగా లోకాన్ని ఉద్ధరించటానికి ప్రయత్నం చెయ్యనక్కరలేదు. నిన్ను నువ్వు ఎంతవరకూ ఉద్ధరించుకొంటున్నావో, నిన్ను నువ్వు ఎంతవరకూ పవిత్రం చేసుకొంటున్నావో, నువ్వు ఎంతవరకూ జ్ఞానం సంపాదిస్తున్నావో, ఆ పాయింట్ వరకూ లోకం ఉద్ధరించబడుతుంది. ప్రత్యేకంగా నువ్వు ప్రయత్నం చెయ్యనక్కరలేదు. నేనుకి మోక్షం కాదు నేనుని విడిచిపెట్టడం మోక్షం. మనం జీవించేది ఈ నేను కోసమే జీవిస్తూ ఉంటే, ఈ నేనుని ఎవడు విడిచిపెడతాడు! అసలు మనం జీవించేది ఈ నేను కోసమే! మన విరోధాలు ఈ నేను కోసమే, స్నేహాలు ఈ నేను కోసమే, బంధువులు ఈ నేను కోసమే. అన్నీ ఈ నేను కోసమే. ఈ నేను ఎవడు? ఈ నేనుని విడిచిపెడితేనే కానీ మోక్షం లేదు. నేను పోతేనే కానీ అజ్ఞానం పోదు. ఈ నేను నేను అంటున్నాము చూడండి, ఈ నేను పోతేనే కానీ అజ్ఞానం పోదు. ఇవి సంకెళ్ళు. నేను, నాది ఈ రెండూ పెద్ద సంకెళ్ళు, ఈ సంకెళ్ళు ఈశ్వరుడి సహాయం లేకుండా మనం నరుక్కోలేము. నా అంతట నేను నరుక్కోలేను. ఇవి బరువైన రాళ్ళు. ప్రతిమనిషికి హృదయంలో రెండే రెండు బరువైన రాళ్ళు; ఒకటి నేను, రెండు నాది.

ఇవి రెండూ బరువైన రాళ్ళు. సమాజం యొక్క సహాయం తోటి, నీ సాధనల యొక్క సహాయంతోటి, ఈ రాళ్ళని బయటికి తీయలేరు. మీరు ఎంత సాధన చెయ్యండి, ఎంత తపస్సు చెయ్యండి, ఈ రాళ్ళు బయటికి పోవు. ఈశ్వరుడి సహాయం లేకుండా గురువు యొక్క సహాయం లేకుండా ఈ బరువైన రాళ్ళని హృదయంలోంచి బయటికి తీయలేరు. ఎంత కాలమైతే హృదయంలో ఈ బరువైన రాళ్ళు ఉంటాయో అంతకాలం ప్రకృతి మనకి దారి ఇవ్వదు, ప్రకృతి మనని విడిచిపెట్టదు. ఈ కటకటాలలోంచి బయటికి వచ్చే ఉపాయం లేదు - నేను నాది, నేను నాది - ఇవే కటకటాలు! ఈశ్వరానుగ్రహం లేకుండా ఇందులోంచి బయటికి వచ్చే అవకాశం లేదు.

భగవాన్‌తో ఒకడు చెప్పాడు, ఫలానా వాళ్ళు అందరూ కలిసి నన్ను ఎక్కడ కనిపిస్తే అక్కడ తిట్టేస్తున్నారు అన్నాడు. అప్పుడు భగవాన్ చెప్పారు. నువ్వు కూడా వాళ్ళతోటి కలిసిపో, కలిసిపోయి నిన్ను నువ్వు తిట్టుకో. వాళ్ళు తిడుతున్నారని నీ అహంకారానికి బాధ వస్తోంది. అంటే నీ అహంకారం పోవటానికి ఒక రకంగా వాళ్ళు నీకు సహాయం చేస్తున్నారు. అందుచేత నిన్ను నువ్వు ఎలాగూ తిట్టుకోలేవు, వాళ్ళతోటి కలిసిపో. వాళ్ళతోటి కలిసిపోయి, వాళ్ళు నీ అహంకారాన్ని తిట్టినట్టు నువ్వు కూడా తిట్టుకో. తిట్టుకుంటే ఇంకా మంచిది. ఎంత నేచురల్‌గా ఉందో చూడండి! నాకు ఎక్కువ కోపం వచ్చేస్తోంది స్వామీ, కోపం ఆపుకుందాము అనుకొంటున్నాను, కానీ కోపం పోవట్లేదు అన్నాడు. కోపం వచ్చినప్పుడు, ఆ కోపం మీద కోపం తెచ్చుకో. కోపం వచ్చేస్తోంది అంటున్నావు కదా, అలా ఉంచుకో ఆ కోపాన్ని; నీకు కోపం వచ్చినప్పుడు నీ కోపం మీద ఆ కోపాన్ని చూపించు. ఇందులో ఏమీ లేదండి రహస్యం. మనిషి పవిత్రుడు అయిన వాడికి జ్ఞానం ఇక్కడే ఉంది. వస్తువు నీ హృదయంలో ప్రత్యక్షంగా ప్రకాశిస్తోంది, ఈ ప్రత్యక్షంగా ప్రకాశిస్తున్న వస్తువుని వదిలేసి ఎక్కడో ఈ లోకంలో ఇతర లోకాలలో మనస్సు ఏదో కల్పిస్తుంది. ఇదంతా మనస్సు యొక్క గారడీ. మనకి దరిద్రం అంటే భయం. ఎవరికైనా దరిద్రం వస్తోంది అంటే చాలా భయం. కానీ దరిద్రాన్ని వరించిన మహర్షులు ఉన్నారు. వాసనాత్యాగం ముఖ్యం, వాసనాత్యాగం చెయ్యకపోతే జ్ఞానం రాదు. త్యాగి కాని వాడు జ్ఞాని కాలేడు. నీ దగ్గర ఉన్న అరటిపండు అదీ కాదు. నీ లోపల ఉన్న వాసనలు నిన్ను దుఃఖపెడుతున్న వాసనలు త్యాగం చెయ్యి. అంటే మనకి అరటిపళ్ళు ఇవ్వటమో, బత్తాయిలు ఇవ్వటమో, పరమేశ్వరుడికి బాహ్యంగా ఉన్న వస్తువులు ఇవ్వటం ఎందుకు అలవాటు చేసారంటే, ఏనాటికైనా వాసనలు త్యాగం చెయ్యటానికి మనం అలవాటు పడతామని. దుష్టవాసనలు త్యాగం చెయ్యాలి.

నటేష్ మొదలియార్ వస్తే మళ్ళీ రెండు రోజులు మాట్లాడలేదు. మళ్ళీ రెండోసారి రిజిష్టర్ ఉత్తరం రాసి వచ్చినప్పటికీ మాట్లాడకపోతే ఆయనకు భగవాన్ మీద కోపం వచ్చింది - నువ్వు జ్ఞానివి అనుకోవచ్చు, ప్రజలందరూ నువ్వు కుమారస్వామి అనుకోవచ్చు, అది నాకు అక్కరలేదు. నువ్వు పెద్ద గురువు జ్ఞాని అనుకొంటున్నావేమో లేకపోతే కుమారస్వామి అవతారం అనుకొంటున్నావేమో, అది నాకు లెక్కలేదు, ఈ జన్మలో నాకు అర్హత లేకపోతే వదిలేయి. నేను అనేకసార్లు నీ దగ్గరకి వచ్చాను. నువ్వు నాతో మాట్లాడలేదు. అయినప్పటికీ నిన్నే నేను గురువుగా భావిస్తున్నాను, నిన్ను గురువుగా పూజిస్తున్నాను, గురువుగా ఆరాధిస్తున్నాను. నా మనస్సులో, నా హృదయంలో నువ్వు మెదులుతున్నావు. పోనీ ఈ జన్మలో నేను పనికిరాను అనుకో, ఈ జన్మలో నాతో మాట్లాడటం మానేయి, నన్ను శిష్యుడిగా తీసుకోవటం మానెయ్యి. ఇంకో జన్మలో నన్ను తీసుకో. అయితే ఇక్కడ షరతు ఒకటి, మళ్ళీ నాకోసం నువ్వు జన్మించవలసి ఉంటుంది, అది మరిచిపోకు. నువ్వు కాదు అనటానికి వీలు లేదు. ఈ జన్మలో నన్ను వదిలేస్తావు అనుకో, నన్ను పట్టించుకోవనుకో, నా కోసం నువ్వు మళ్ళీ పుట్టాలి, నన్ను రక్షించటం కోసం. నాకు జ్ఞానాన్ని కలుగచెయ్యటం కోసం మళ్ళీ నువ్వు పుట్టవలసి ఉంటుంది. ఎందుచేతనంటే నేను నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టి, ఇందులో సిన్సియారిటీ ఉంది. నటేష్ మొదలియార్‌కి భగవాన్ మీద అంత ప్రేమ ఎవరు ఇచ్చారు? భగవాన్ ఇచ్చారు ఆ ప్రేమ. భగవాన్ మీద అంత ప్రేమ, ఆపుకోలేని అనురాగం భగవాన్ ఇచ్చారు. అయితే ఈ ప్రేమ కూడా భగవాన్ ఇచ్చారన్న సంగతి నటేష్ మొదలియార్‌కి తెలియక, అలా కఠినమైన మాటలతోటి, నిష్ఠూరమైన మాటలతోటి ఉత్తరాలు రాసేసేవాడు. భగవాన్ అంటే క్రూయల్ లవర్! ప్రేమించినట్టుగా కనిపించడు బయటికి, మన హృదయాన్ని పిండేస్తాడు ప్రేమతోటి! బయటికి ఏమీ కనబడడు, హృదయాన్ని మట్టుకు పిండేస్తాడు.

శేషాద్రి స్వామి దగ్గరికి ఎవరైనా వెళ్తే, నా దగ్గరకి ఎందుకు? వాడి దగ్గరకి పొండి వాడు మీకు శుభ్రంగా భోజనం పెట్టి మోక్షం కూడా ఇస్తాడు. భుక్తి ముక్తి రెండూ ఇస్తాడు వాడు, వాడి దగ్గరికి పొండి అనేవారు. మీరు అనుకొంటున్నారు ఈ ఆదివారం మీటింగులకి మనం శ్రద్ధగా వస్తున్నామని. శ్రద్ధగా రావటం మీ ఇష్టమా? శ్రద్ధగా రావాలంటే మీరు రాగలరా? భగవాన్ మిమ్మల్ని తీసుకొస్తున్నాడు. ఈ రహస్యం మీరు మరిచిపోకండి. శ్రద్ధగా రావాలి అనుకొన్నా మీరు రాలేరు. మీకు అనిపిస్తుంది శ్రద్ధగా వస్తున్నాము మనము అని, కానీ భగవాన్ మిమ్మల్ని తీసుకొస్తున్నారు. భగవాన్ని ప్రేమిస్తున్నాము అంటే, ఆ ప్రేమ ఎవరిదీ,

భగవానుదే! లేకపోతే మనకెక్కడిది, జీవుడికి ప్రేమ ఉందా? సొమ్ము ఆయనదే, సొమ్ము మనది కాదు, ఈశ్వరుడిదే. ఆయనే స్వామి! స్వామి అంటే ఎవడు? సొత్తుగలవాడు స్వామి. అంటే మనం ఎవరి సొత్తు, మనం ఈశ్వరుడి యొక్క సొత్తు. మన స్వామి ఎవరు? ఆయనే. అందుచేత మన కాలాన్ని, మన దేహాన్ని, మన సర్వశక్తులని ఆయన దగ్గరికి వెళ్ళటానికి, ఆయనని పొందటం కోసం మనం ఖర్చు పెట్టాలి. ఇది మనకు తెలియాలి. మీ దగ్గర పని చేసే మనిషి, మీ కోసం ఎలా అయితే పని చేస్తున్నాడో, అలా ఈశ్వరుడి కోసం మనం పని చేస్తుంటే అప్పుడు ఈశ్వరుడి యొక్క పాదాల దగ్గరికి మనం చేరుకుంటాం. ఆ భావన అవసరం.

రామానుజాచార్యులు ఒకసారి శిష్యుడికి ఏదో పాఠం చెపుతున్నారు. ఆ భావన చూడండి, గురువు యందు భావన! ఆచార్యులు వారు ఏదో పరాకుగా ఉండి పాఠం తప్పు చెపుతున్నారు. మీరు పాఠం పొరపాటు చెపుతున్నారు అంటే గురువుగారు ఏమనుకుంటాడో. అయితే ఈ శిష్యుడు ఏం చేస్తాడు పాపం; రాయటం మానేసాడు. ఎందుకు రాయటం లేదు అన్నాడు రామానుజుడు. మీరు తప్పు చెప్పారు కాబట్టి నేను రాయటం లేదు అంటే గురువుగారు ఏమనుకుంటారో. గురువుగారికి తప్పులు చెపుతున్నాడు అనుకుంటారేమో. పో పో అన్నాడు రామానుజుడు చిరాకు వచ్చి. శిష్యుడు టైర్ అయిపోయాడేమో అనుకున్నాడు. వాడు టైర్ అవ్వలేదు గురువుగారు తప్పు చెపుతున్నాడు. పో పో అంటే వెళ్ళిపోయాడు. మళ్ళీ మరుసటి రోజున కూర్చున్నాడు. ఈయన ఏదో పరాకులో మళ్ళీ రెండోసారి కూడా ఆ తప్పునే మొదలు పెట్టాడు. వీడేమో ఇది అందరూ చదువుకుంటారు, చదివిన జనం అందరూ దెబ్బ తింటారేమో, ఈయన తప్పు చెపుతున్నాడు అని ఆలోచిస్తున్నాడు. రెండోసారి కూడా ఒక ఐదు నిమిషాల వరకూ రాయడే! మళ్ళీ పో అన్నాడు, వాడికి చిరాకు వచ్చి పొమ్మంటున్నాడు. మళ్ళీ రెండోసారి కూడా పోయాడు. మూడోసారి వచ్చాడు. సరే మూడో రోజున కూర్చున్నాడు. మూడోరోజున కూర్చుంటే మళ్ళీ తప్పు చెపుతున్నాడు గురువుగారు. తప్పని రామానుజుడికి గుర్తుకు రావటం లేదు, గురువు గారికి చెప్పటానికి వీడు జడుస్తున్నాడు. అపచారం అనుకొంటున్నాడు, వాడి భక్తి చూడండి. రామానుజుడికి కోపం వచ్చి రాసేవాడి దగ్గర ఘంటం చేతితో పుచ్చుకొని వాడి మీదకి దెబ్బ తగిలేలాగ విసిరేసాడు. పక్కన మనబోటి పెద్ద మనుషులు ఉంటారు కదా! అందేటి నువ్వు అలా ఊరుకొంటున్నావు, ఘంటం పుచ్చుకొని కొట్టాడు నీ గురువు. అలా ఊరుకుంటావేమిటి? నువ్వు రాస్తే రాస్తావు లేకపోతే లేదు. అలా ఘంటం పుచ్చుకొని కొడతాడా గురువు. పక్కన మనవంటివారు ఉంటారు కదా!

ఎక్కడైనా నిప్పు కనిపిస్తే దానిపైన ఇంకాస్త గడ్డి వేస్తారు, ఇంకా మంట పెద్దది అవ్వటం కోసం. మనవి ఇరుకు హృదయాలు, ఇరుకు మనస్సులు. మూడోసారి ఏం చేసాడూ, ఘంటం పుచ్చుకొని కొట్టాడు, పక్కవాళ్ళు అదేంటయ్యా అలా ఊరుకుంటావు ఘంటం పుచ్చుకొని కొట్టాడు అన్నారు. ఇంతకీ ఈ మాట ఎందుకు చెపుతున్నాను అంటే - ఆ శిష్యుడు ఏమన్నాడంటే, ఆయన నాకు యజమాని, నా దేహాన్ని ఆయన ఇష్టం వచ్చినట్లు వాడుకుంటాడు. మీరెవళ్ళు అడగటానికి అంటాడు. ఆయన నాకు యజమాని, ఆ యజమాని ఈ దేహాన్ని కొడతాడు లేకపోతే పడేస్తాడు. నా కళ్ళజోడుకి నేను యజమానిని, ఇది సరిగ్గా పనిచెయ్యటంలేదు అనుకోండి, నాకు ఇష్టం లేకపోతే మురికి కాలువలో గిరాటేస్తాను, మీరెవరు దెబ్బలాడటానికి? మీ కళ్ళజోడు నేను పారేస్తే మీరు దెబ్బలాడవచ్చు. అలాగే నా దేహానికి నా మనస్సుకి ఆయన యజమాని. అందుచేత ఆయన ఘంటం పెట్టి కొడితే కొడతాడు, ఆయన ఎలా ఉపయోగించుకోవాలంటే అలా ఉపయోగించుకుంటాడు, ఇందులో దెబ్బలాట ఏముంది అన్నాడు? అదీ శరణాగతి! కంప్లిటెస్ట్ సరెండర్ టు ది విల్ ఆఫ్ గాడ్! మన సంకల్పాన్ని బట్టి కాదు నడుచుకోవటం, భగవంతుడి సంకల్పాన్ని బట్టి, భగవంతుడి ఇష్టాన్ని బట్టి మనం నడుచుకోవాలి. భగవంతుడి సంకల్పానికి అనుగుణంగా ఎవడైతే ప్రవర్తిస్తున్నాడో, భగవంతుడు చెప్పినట్టుగా ఎవడైతే వింటున్నాడో, భగవంతుడి హృదయాన్ని సంతోషపరిచేటట్టుగా ఎవడైతే మసులుతున్నాడో, ఎవడైతే తన దేహాన్ని, తన ధనాన్ని, తన జీవితాన్ని, తన సర్వస్వాన్ని, తన ఇంద్రియాలని, తన మానసికశక్తులని, నాది అనేది నేను అనేది సమస్తం ఎవడైతే ఈశ్వరుడి కోసం ఖర్చు పెడుతున్నాడో, ఈశ్వరుడిని హృదయపూర్వకంగా ఎవడైతే శరణు వేడుకొంటున్నాడో, ఈశ్వరుడిని ప్రేమించటంలో ఆ మధురమైన ప్రేమలో ఈ నేను నాది అనేవి ఎవడైతే పోగొట్టుకున్నాడో, వాడికి ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. రామానుజుడి శిష్యుడికి వచ్చిన శరణాగతి మనకి రావాలి.

ఇంకొకసారి రామానుజుడికి ఆ శిష్యుడే ఇంటివద్ద వంట చేస్తున్నాడు. శ్రీరంగంలో రంగనాధుడి కళ్ళు చాలా అందంగా ఉంటాయి. రంగనాధుడు ఊరేగుతున్నాడు ఆ ఊరిలో. శిష్యుడిని పిలుస్తాడు రామానుజుడు, స్వామి వస్తున్నాడు, రంగనాధుడు ఊరేగుతున్నాడు తొందరగా రా అని. శిష్యుడు లోపల పాలు కాస్తున్నాడు. తొందరగా రా అని పిలుస్తున్నాడు, మళ్ళీ ఊరేగింపు వెళ్ళిపోతుంది, తొందరగా రా అన్నాడు ఎందుకంటే శిష్యుడు ఊరేగింపు చూస్తాడని. అప్పుడు శిష్యుడు అంటాడు, నీ స్వామిని నువ్వు చూసుకో, నా స్వామి గొడవలో

నేను ఉన్నాను. నా స్వామికి నేను పాలు కాస్తున్నాను. నీ స్వామిని కావాలంటే నువ్వు చూసుకో. ఆయన నీకు రంగనాధస్వామి, నాకు రంగనాధస్వామి కాదు, నువ్వే నాకు స్వామివి. అందుచేత నీ స్వామిని నువ్వు చూసుకో, నా స్వామికి పాలు కాచే హడావిడిలో నేను ఉన్నాను. ఏమి మధురమైన భక్తో చూడండి, ఏమి శరణాగతి అండీ!

రామాయణంలో రాముడు అంటాడు "లక్ష్మణా! ఈ పర్ణశాల నువ్వు బాగా ఆలోచించి, ఎక్కడ బాగుంటుందో అక్కడ పునాదులు వేసి పర్ణశాల కట్టు" అంటాడు. నన్ను అంత పెద్దవాడిని చెయ్యొద్దు అంటాడు లక్ష్మణుడు. ఏమి శరణాగతి చూడండి! నన్ను అంత పెద్దవాడిని చెయ్యకండి. మీరు ఫలానా చోట పునాది వేసి కట్టమంటే నేను కట్టేవాడినే కానీ, నన్ను ఆలోచించి చెయ్యమంటే, నేను పనికిరాను ఆలోచించటానికి. నన్ను ఆలోచించమని అనకండి, మీరు ఎలా చెపితే అలా చేసేవాడినే నేను. ఆలోచించటానికి నేను ఎవడను? మీరు ఎలా చెయ్యమంటే అలా చేస్తాను అన్నాడు. అదీ శరణాగతి! జనకుడు లాంటి మామగారు దొరకొచ్చు, సీతమ్మలాంటి భార్య దొరకొచ్చు కానీ లక్ష్మణుడు లాంటి తమ్ముడు దొరకటం కష్టం అన్నాడు రాముడు.

సాధన చెయ్యండి కానీ అహంకారం పెంచుకోవద్దు. గంటలు కాదు, ఎన్ని గంటలు చేస్తున్నాము, ఎన్ని రోజులు చేస్తున్నాము అలా కాదు మీరు లెక్క పెట్టుకోవలసింది. లోపల అహంకారం ఎంత పలచబడుతోంది. మీకు ఇష్టమైతే పూజలు చేసుకోండి, జపాలు చేసుకోండి. దేవుడిని ఆరాధించుకోండి, దేవతలకి నమస్కారాలు పెట్టుకోండి, ఉపవాసాలు చేసుకోండి, సహవాసాలు చేసుకోండి, వ్రతాలు చేసుకోండి, క్షీరాన్నం కాచుకోండి. ఇవన్నీ మంచివే. మీ ఇష్టం వచ్చినట్లు మీ పద్ధతిలో మీరు చేసుకోండి. కానీ లోపల మీ అహంకారం మూలం కదులుతోందా లేదా ఆ వేరు ఏమన్నా తెగుతోందా లేదా అది చూసుకోండి. అహంకారం కనుక తగ్గకపోతే వాడికి జ్ఞానం రాదు. అజ్ఞానం అంతా అహంకారం రూపంలో ఉంది. మనమేం చేస్తున్నాం, అజ్ఞానం అహంకార రూపంలో ఉందని తెలుసుకోవటం మానేసి, బయట ఎక్కడో ఉందని వెదుకుతున్నాము దానిని పోగొట్టుకోవటం కోసం. బయట ఉంటే కదా పోగొట్టుకోవటానికి? ఎలా పోగొట్టుకుంటారు, బయట ఉంటే పోగొట్టుకోగలరు. అది బయట ఉంటే కదా అసలు! అజ్ఞానం అనేది సబ్జెక్టివే కానీ ఆబ్జెక్టివ్ కాదు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

| | | |
|---|---|---|
| మే | 9 | శంకర జయంతి - మధ్యాహ్నం గం॥ 1-00లకు హైదరబాద్ అరుణగారి ప్రవచనం |
| మే | 18 | బుద్ధ జయంతి - మధ్యాహ్నం గం॥ 1-00లకు అమలాపురం మాష్టారి ప్రవచనం |

**SRI RAMANA KSHETRAM A/c. No. 51010100649727 3**
**Corporation Bank, Palakol Branch, IFSC Code : CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

# శ్రీ ఆదిశంకరాచార్యులు

క్రీ॥శ॥ 788-820 మధ్య కాలములో శ్రీఆదిశంకరాచార్యులు జీవించినట్లుగా చెప్పబడుతోంది. కేరళ రాష్ట్రంలోని పూర్ణానది ఒడ్డున గల కాలడి గ్రామంలో ఆర్యాంబ, శివగురువు పుణ్య దంపతులకు వరప్రసాదముగా, శంకరుడు జన్మించాడు. సకల వేద సారము అద్వైతానుభవమే! శరీరధారిగా ఆయన భూమి మీద సంచరించినది 32 సంవత్సరములు మాత్రమే. అయినప్పటికీ, వాహన సదుపాయములు లేని ఆ కాలములో, కాలినడకన దేశమంతా తిరిగి, జ్ఞానబోధ చేసారు. ఆయన కొంతకాలం కాశీ నివాసం చేసారు. అనేక భాష్య గ్రంథాలు, ప్రకరణ గ్రంథాలు, స్తోత్ర గ్రంథాలు రచించారు. ధర్మ ప్రచారము, జ్ఞానబోధ, ప్రజాశ్రేయస్సు, లక్ష్యముగా భారతదేశము నాలుగు దిక్కులలోనూ, నాలుగు శంకర మఠములను స్థాపించి, తన నలుగురు శిష్యులను వాటికి అధిపతులుగా చేసారు, ఆ పరంపర నేటికీ కొనసాగుతోంది. శంకరునికి గురువు గోవింద భగవత్పాదులు. మానవ శరీరం లభించడం, మోక్షకాంక్ష కలిగి యుండడం, సద్గురువు లభించడం, వంటివి జ్ఞాన సముపార్జనకు పరమాత్మచే మనకు ప్రసాదించబడిన వరములుగా పేర్కొంటారు శంకరులు. పూర్వజన్మలలో ఎంతోకొంత సత్కర్మ చెయ్యకపోతే, సత్పురుషులతో, సహృదయం ఉన్నవారితో, సహవాసం చెయ్యాలనే బుద్ధి కూడా కలగదు. ఆత్మజ్ఞానం అనేది గురుకృప వల్లనే సాధ్యం అంటారు శంకరులు. బ్రహ్మము యొక్క అనంతత్వము గురించి, జీవుని యొక్క మరియు దృశ్యప్రపంచము యొక్క మిధ్యా తత్త్వము గురించి, జీవుడు వాస్తవముగా తాను ఎవరో? తెలుసుకొనుటకు అవసరమగు సాధన సంపత్తిని గురించి, సమగ్రముగా వివరించారు. తత్త్వసంపదను భావితరాలకు అందించిన జ్ఞాన సూర్యుడు. నాటికీ, నేటికీ పరమపూజ్యునిగా, జగద్గురువుగా, మానవాళిచే పూజలు అందుకుంటున్న శంకరుని అనుగ్రహము, దయ, బోధ, నిరంతరమూ మనమీద వర్షిస్తూనే ఉంది!

**(ది॥ 09-05-2019 శ్రీ శంకర జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# దైవీమయ జీవితానికి - సద్గురువే గీటురాయి

వేదరహస్యాలు ఎరిగినవాడే గురువు, వ్యాకరణ పండితుడు కాదు. పరమార్థమును తెలిసిన వాడే గురువు. గంధపు చెక్కలను మోసే గాడిద దాని బరువును మాత్రమే తెలుసుకొంటుంది. దానిలోని సుగంధము తెలియదు. పండితులు అట్టివారే. బ్రహ్మాన్ని తెలుసుకొన్నవాని వాక్కు వేదవచనాలే. దీనికి సద్గురువు వచనాలే సాక్ష్యం. సద్గురువు స్పర్శ, ఒక చూపు జీవితాన్ని ఆమూలాగ్రంగా మార్చివేస్తుంది. సత్య దర్శనానికి గురువు ఉండి తీరాలి. వేదరహస్యాలు గురుశిష్యపరంగా ఆశ్రయించి ఉంటుంది. అది కళయైనను, శాస్త్రమైనను గురు ప్రబోధవల్ల శిష్యునికి అవగతమవుతుంది. మంచిచెడ్డలు విషయం తెలుసుకొనే శక్తి ప్రతీ సాధకునకు ఉంటుంది. కానీ దుఃఖాలకు, భ్రాంతులకు నిలయమైన సంసార సముద్ర తరంగాల తాకిడిని లెక్కచెయ్యలేక అలమటించే శిష్యునికి గురువు ఒక చేతితో కన్నీటిని తుడుచుచూ, రెండవ చేతితో మోక్ష మార్గాన్ని చూపగల ప్రేమపూరితమైన ధీరుడైన గురువు కావాలి. అలాంటి ప్రేమపూరితమైన గురువు వద్దకు శిష్యుడు వచ్చి క్లేశాలను తట్టుకోలేక అయ్యా "సాధన చెయ్యలేకపోతున్నాను" అనగా ఆ గురువు "అది నా తప్పే" అని కన్నీళ్ళు పెట్టుకొనే గురువు ఉన్నారు. శబరి శ్రీరామునిపై అడవిలో నిరీక్షించిన భక్తిశ్రద్ధల్లో సహనం ఉంది. అది ఆమె గురువు మతంగ మహర్షి మాటల్లో అచంచలమైన విశ్వాసం ఉంది. అలాగే సీతాదేవి రాముని విజయం కోసం నిరీక్షించింది. అందులో సహనం, విశ్వాసం ఉంది. అలాగే సాధకుడు "నాకు రక్షకుడు ఉన్నాడు ఒడ్డునకు చేరుస్తాడు". ఈ రెండూ పుష్కలంగా ఉంటే గురుకృప ద్వారా మనస్సు నిశ్చలం చేస్తుంది. "నిశ్చలచిత్తే జీవన్ముక్తి" అన్నారు శంకరభగవత్పాదులు. శిష్యుడు వజ్రంలాంటి వాడైనా గురుసాంగత్యం లేకపోతే ఆత్మలో ప్రవేశించలేడు. గురుదర్శనం అజ్ఞానం నశింపచేస్తుంది. హృదయంలో జ్ఞాన జ్యోతి వెలుగుతుంది. గురువు విశ్వమానమయమైన ప్రేమద్వారానే శిష్యునికి ఆధ్యాత్మిక శక్తిని ప్రసరించగలరు. అట్టి ప్రేమ మయుడి ప్రేమ ద్వారా జ్ఞాన నేత్రం తెరుచుకుంటుంది. భగవన్ నిమగ్నమైన గురువు లభించినప్పుడు మనకు బాలుని విశ్వాసం బోలు విశ్వాసంతో సరళ హృదయంతో ఆయన్ని సేవించాలి. ఆరాధించకుండా ఉండలేకుండా ఉండాలి. అది ప్రత్యక్షం కానక్కరలేదు, వారి ఛాయాచిత్రంలో వారిని సజీవంగా చూడవచ్చును. అప్పుడు శిష్యుడు సురక్షితుడు అవుతాడు. గురువు శిష్యుని పాప భారాన్ని మొయ్యాలి. ఆ కారణం చేతనే సాధకుడు శక్తివంతుడవుతాడు. ఈ ప్రక్రియలో గురువుకు వ్యాధులు పొడచూపుతాయి. ఇది కష్టమైన విషయమే. అందుకే శ్రీనాన్నగారు ఒక సమావేశంలో "మీకు జీతభత్యాలు లేని పెద్ద పాలేరును" అన్నారు. గురువు యొక్క మనఃస్థితిని అర్థం చేసుకోవటం అతి కష్టం. ఒకవేళ అర్థం చేసుకొన్నా సరిగ్గా వ్యక్తీకరణ అసాధ్యం. ఎటువంటి పదజాలాన్ని వాడినా అందమైన అబద్ధమే అవుతుంది. సామాన్య సాధకులకు అసలు స్థితికి అందదు అది అనుభవానికి అందుతుంది. పై నాన్నగారి మాట హృదయానికి తాకితే ఆయన్ని ఒక్క క్షణం కూడా విడువకుండా ప్రేమించకుండా ఉండగలమా!

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966